# బ్రహ్మసూత్రములు

## - వేదవ్యాస మహర్షి





**: వ్యాఖ్యాత :**

'అభినవ వ్యాస' 'జ్ఞాన ప్రపూర్ణ'

శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc (Ag)

వ్యవస్థాపకులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం : : చిలకలూరిపేట

Website : www.srichalapathirao.com

# బ్రహ్మసూత్రములు

అధ్యాయములు - 4

ఒక్కొక్క అధ్యాయములో పాదాలు - 4 (4X4 = 16 పాదాలు)

బ్రహ్మసూత్రములు - అనేది వేదాంత మీమాంసాశాస్త్రం

వేదాంతం అంటే వేదాలకు అంతంలోని ఉపనిషత్తులు

మీమాంస అంటే పరిశీలన చేయుట

దీనికే ఉత్తర మీమాంస అనే పేరుంది

సూత్ర రూపంలో ఉన్నదీ గ్రంథం. సూత్రం అంటే -

శ్లో ॥ అల్పాక్షర మసందిగ్ధం సారవద్ విశ్వతో ముఖం ।

అస్తోభమనవద్యంచ సూత్రం సూత్రవిదోవిదుః ॥

తా ॥ కొద్ది అక్షరాలు కలిగి, అనుమానానికి తావులేని అర్థం కలిగి, సారవంతమై, బహుముఖమై, ఆకారంలో చిన్నదై, ఏ విధమైన దోషములేని వాక్యాన్ని సూత్రం అంటారు

# బ్రహ్మసూత్రములు

## తొలిపలుకు

ఈ లోకంలో జన్మించిన ప్రతి జీవి, ప్రతి ప్రాణి తాను ఎలా సుఖంగా జీవించాలా ? అని ఆలోచిస్తుంది. అందుకు అనుగుణంగా ప్రవర్తిస్తుంది. ఇక మానవుడు బుద్ధిజీవి గనుక బుద్ధితో ఎన్నో విషయాలను తెలివితో ఆలోచిస్తాడు. కొత్త కొత్త ప్రయోగాలు చేస్తుంటాడు. నిరంతరం అన్వేషిస్తూ ఉంటాడు. బాగా సుఖసంతోషాలను పొందేవారిని చూచి అనుకరిస్తాడు. ఇలా నిరంతరం మానవుడు చేసే ప్రయత్నంలో అతడికి అనేకమైన ఆలోచనలు వస్తుంటాయి.

1. నేనెవరిని ?
2. ఈ ప్రపంచం ఏమిటి ?
3. దీనిని ఎవరు సృష్టించారు ?
4. ఈ గ్రహాలు, ఉపగ్రహాలు ఒక క్రమ పద్ధతిలో తిరుగుతున్నాయే ! ఎవరు త్రిప్పుతున్నారు ? ఎక్కడ కూర్చొని త్రిప్పుతున్నారు ?
5. ఈ జీవుళ్ళన్నీ ఎక్కడి నుండి వస్తున్నాయి ?
6. మరణించి ఎక్కడికి పోతున్నాయి ?
7. ఈ భూలోకంలాగా స్వర్గలోకం - నరకలోకం అంటూ ఇంకా లోకాలున్నాయా ? ఉంటే అవి ఎక్కడున్నాయి?
8. అసలు ఈ జీవుళ్ళు పుట్టటమెందుకు ?
9. అసలు ఈ సృష్టిని ఎవరు చేస్తున్నారు ? ఎందుకు చేస్తున్నారు ?
10. ఈ లోకంలో జన్మించిన మానవులు చేయవలసిన పని ఏమిటి ? సాధించవలసిన లక్ష్యమేమిటి ?

ఇలా ఎన్నో ఆలోచనలు మానవునిలో మెదులుతూ ఉంటాయి. వీటికి సమాధానంగానే తత్త్వశాస్త్రం పుట్టింది. వేదాలు - ఉపనిషత్తులు పుట్టాయి. అవే ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వవలసి ఉంటుంది.

అనేకమంది తత్త్వవేత్తలు అనేక రకాల ఆలోచనలు చేసి వారివారి అభిప్రాయాలను వెల్లడించారు. మానవునిలో కలిగే జిజ్ఞాసకు - వారి సందేహాలకు సమాధానం ఇవ్వటానికి ప్రయత్నించారు. ఉపనిషత్తులలో ఈ విధమైన చర్చలు, ప్రతిపాదనలు కనిపిస్తున్నాయి. ఉపనిషత్తులనేవి నిజానికి ఒక దేశానికి, ఒక జాతికి, ఒక మతానికి, ఒక కాలానికి పరిమితమైనవి కావు. అవి ఈ విశ్వం మొత్తానికి, అన్ని కాలాలకు పరమసత్యాన్ని చాటిచెప్పిన వేదాంతశాస్త్రాలు. భారతీయులైన ఋషిపుంగవులు ప్రగాఢధ్యానంలో దర్శించిన పరమసత్యాన్ని వెల్లడించినవి ఈ ఉపనిషత్తులు. ఎన్నో వేల సంవత్సరాల నుండి ఆటుపోటులకు తట్టుకొని నిలిచిన వేదాంతశాస్త్రాలే ఈ ఉపనిషత్తులు.

ఐతే కాలం గడిచిన కొద్దీ ఈ ఉపనిషత్తులకు అర్థం చెప్పటంలో అభిప్రాయ భేదాలు ప్రారంభమైనవి. దానితో ఈ ఉపనిషత్తులను పురస్కరించుకొని వేరువేరు మతాలు, వాదాలు బయలుదేరాయి. ఎవరికి తోచిన అర్థం, ఎవరికి అనుకూలమైన అర్థం వారు కల్పించుకున్నారు. అలా వచ్చినవే ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం, ద్వైతాద్వైతం, శైవవిశిష్టాద్వైతం, వీరశైవవిశిష్టాద్వైతం, శుద్ధాద్వైతం,... అంటూ ఎన్నో మతాలు.

ఇవన్నీ ప్రజల్లో అనైక్యతను పెంచాయి. పరమార్థం ప్రక్కకు నెట్టబడి పాండిత్యం ముందుకొచ్చింది. ఫలితంగా సామాన్య మానవునికి ఈ ఉపనిషత్తులు మార్గం చూపలేకపోతున్నాయి. ఇందువల్ల జాతికి గొప్ప నష్టం కలిగింది.

అంతేకాదు ఈ ఉపనిషత్తులు అనేకంగా ఉన్నాయి. నాలుగు వేదాలలోను 1180 ఉపనిషత్తులున్నాయి. ఋగ్వేదంలో 21, యజుర్వేదంలో 109, సామవేదంలో 1000, అధర్వణ వేదంలో 50 శాఖలున్నాయి. మొత్తం 1180 శాఖలు; 1180 ఉపనిషత్తులు. ఈ ఉపనిషత్తులలో ఒక దానిలో చెప్పిన విషయానికి విరుద్ధంగా మరొక ఉపనిషత్తులో ఉన్నట్లు కనిపిస్తుంది. వీటిని సమన్వయము చేయలేక, చేయక - ఎవరికి అనుకూలమైన భావాన్ని వారు తీసుకొని వ్యాఖ్యానించటం వల్ల గజిబిజి ఏర్పడింది.

ఇలాంటి పరిస్థితులలో ద్వాపరయుగం చివరలో వేదవ్యాసమహర్షి ఈ ఉపనిషత్తుల అర్థాన్ని సరైన పద్ధతిలో గ్రహించేటట్లు చేయటానికి ఈ ఉపనిషత్తు మంత్రాలను సమన్వయము చేస్తూ ఈ బ్రహ్మసూత్ర రచన చేయుట జరిగింది. దీనితో వైరుధ్యాలన్నీ తొలగి ఏక వాక్యత కలుగుతుందని ఆ మహర్షి భావించారు.

అయితే ఈ సూత్రాలపై కూడా వేరు వేరు భాష్యాలు వచ్చినవి. ఇప్పటికీ వస్తూనే ఉన్నాయి. అయితే శంకరుల భాష్యమే అత్యధికులు అంగీకరిస్తున్న భాష్యం. ఆయనే మొదటివారు. ఆయనకు పరమ గురువైన గౌడపాదులు తన మాండుక్య కారికలలో అద్వైతానికి పునాది వేయటం జరిగింది. ఆ పునాది మీదనే శంకరాచార్యుల అద్వైత భాష్యమనే భవనం నిలిచిఉన్నది. దీనిని బట్టి శంకరునికి పూర్వమే అద్వైతం వ్యాప్తిలో ఉన్నది. కనుక అద్వైతానికి ఆద్యుడు శంకరులు కాదు. ఆయన అద్వైతాన్ని వ్యాపింపజేసిన మహాత్ముడు మాత్రమే.

# ఇక గ్రంధ విషయం గురించి

ఈ గ్రంధం జీవుడికి - బ్రహ్మమునకు భేదం లేదు. ఇద్దరు ఒక్కటే అని చెప్పటానికి కావలసిన విచారణ చేయబడింది. ఉపనిషత్తులన్నీ ఈ జీవబ్రహ్మైక్యతనే చెబుతున్నాయి

ఈ జనన-మరణరూప సంసారబంధనాల నుండి పూర్తిగా విముక్తి చెందటమే మానవుడి పరమలక్ష్యం అని బోధించటమే ఈ గ్రంధ ఉద్దేశం. అలా విడుదల పొందాలంటే జీవుడు బ్రహ్మమే అనే జ్ఞానం కలగాలి. ఈ జ్ఞానం కలగటానికి అడ్డుగా ఉన్నదే అవిద్య. దీనికే అజ్ఞానం, మిధ్యా జ్ఞానం, మిధ్య, భ్రమ, భ్రాంతి అనే పేర్లున్నాయి. అవిద్యకే అధ్యాస అనే మరొక పేరుంది.

త్రాడును చూచి పాము అని భ్రమ పడతాం. త్రాడు సత్యం. పాము అసత్యం. ఈ భ్రమనే అధ్యాస అన్నారు. అంటే ఒక దానిని చూచి మరొక దానిగా భ్రమ పడటమే అధ్యాస. పరమాత్మను ప్రపంచంగా, ఆత్మను జీవుడిగా భ్రమ పడుతున్నాం. ఈ భ్రమ తొలగితేనే ఉన్న దానిని ఉన్నట్లు తెలుసుకోగలుగుతాం. భ్రమ ఉన్నంత కాలం దుఃఖం తప్పదు.

ఆత్మనైన నేను ఆత్మనని మరచి, జీవుణ్ణి అని భ్రమ పడినందునే - అధ్యాస వల్లనే నా భార్య, నా ఇల్లు, నా కొడుకు, నా కూతురు, నా డబ్బు, నా పొలం అనే భావం కలుగుతున్నది. అందువల్ల దుఃఖ నివృత్తి కావాలంటే అధ్యాస తొలగాలి. దానికి ఆత్మ విచారణయే ఏకైక మార్గం. ఈ విచారణ కొరకే ఈ బ్రహ్మసూత్రాలు.

**మొదటి సూత్రం**

**సూత్రం : అధాతో బ్రహ్మ జిజ్ఞాసా (1)**

అధ = పిమ్మట, ఆ తరువాత

అతః = అందువల్ల, కాబట్టి

బ్రహ్మ జిజ్ఞాసా = బ్రహ్మమును తెలుసుకోవాలనే కోరిక.

**భావం :** (సాధనచతుష్టయ సిద్ధించిన) తరువాత (కర్మఫలం అనిత్యమైనదని, జ్ఞాన ఫలమైన మోక్షం నిత్యమని తెలిసినది) కాబట్టి, మోక్షార్థియైనవాడు బ్రహ్మాన్ని తెలుసుకోవాలనే కోరికతో ఉంటాడు – ఉండాలి.

**వ్యాఖ్య :** ఈ సూత్రంలో అధ - అతః బ్రహ్మ జిజ్ఞాస అనే 3 పదాలున్నాయి. ముందు ఈ పదాలను విశ్లేషణ చేద్దాం.

**I. అధ :-** అధ అనేది మంగళవాచకం. ఏ శాస్త్ర గ్రంధాన్నైనా ప్రారంభించేటప్పుడు మంగళకరమైన శబ్దంతో ప్రారంభించటం శాస్త్రసాంప్రదాయం. అందుకే ఈ బ్రహ్మసూత్రాలను అధ అనే మంగళవాచకంతో ప్రారంభిస్తున్నాడు వ్యాసుడు. పూర్వమీమాంస అనబడే ధర్మసూత్రాలను కూడా 'అధ' తోనే ప్రారంభించారు. అలాగే అనేక ఉపనిషత్తులను కూడా 'అధ'శబ్దంతో ప్రారంభించటం జరిగింది. అధ అశ్వలాయనో భగవంతం ....(కైవల్య). ఇక భగవద్గీత కూడా నిజమైన ప్రారంభం 'అధవ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజ' తోనే ప్రారంభం అంటారు. కనుక ఇది కూడా అధతో ప్రారంభమైంది. ఇలా అనేక శాస్త్రాలు 'అధ' అనే మంగళ వాచకంతో ప్రారంభమైనవి. మరికొన్ని శాస్త్రాలు 'ఓం' అనే మంగళ వాచకంతో ప్రారంభమైనవి.

అధ అంటే తరువాత అని అర్థం చెప్పుకున్నాం. దేని తరువాత? - అనే ప్రశ్న వస్తుంది. 'సాధనచతుష్టయ సంపద పొందిన తరువాత' అని గ్రహించాలి.

సాధనచతుష్టయం అంటే ఏమిటి? 4 సాధనాలు అని.

**(1) నిత్యానిత్యవస్తు వివేకం:-** నిత్యమైన వస్తువేది? అనిత్యమైన వస్తువు ఏది? అనే జ్ఞానం ఉండాలి. నిజంగా ఈ లోకంలోని వస్తువులన్నీ అనిత్యమైనవే. భగవంతుడొక్కడే నిత్యం. అందుకే "నిత్య వస్త్వేకం బ్రహ్మ తద్ వ్యతిరిక్తం సర్వం అనిత్యం" అని తత్త్వబోధలో తెలియజేశారు శంకరాచార్యులవారు. నిత్య జీవితంలో మనం

ప్రతి విషయంలోను ఇది నిత్యమా? అనిత్యమా? అని ప్రశ్నించుకుంటూ ఉంటే సమస్తము అనిత్యమేనని తెలుస్తుంది. అలాంటి భావన మనలో వృద్ధి చెందుతూ ఉంటే ప్రయోజనం ఏమిటి?

**(2) ఇహా మంత్రార్థ ఫలభోగ విరాగం :-** ఈ లోకానికి సంబంధించిన భార్య, భర్త, బిడ్డలు, ధనం, ఇళ్ళు, వాకిళ్ళు, వస్తువులు, బంగారం, లాభం, నష్టం మొ॥న సమస్త విషయాలయందు వైరాగ్యం కలుగుతుంది. అంతేగాదు మరణానంతరం పైలోకాల యందు లభించే స్వర్గభోగాల యందుగాని, తరువాత జన్మలలో కలిగే సుఖభోగాల యందుగాని ఏమాత్రం ఆసక్తి లేకుండా వాటిపట్ల కూడా వైముఖ్యం - వైరాగ్యం కలుగుతుంది. ఈ వైరాగ్య భావన కలుగుతున్న కొద్దీ పరమాత్మపై ఆసక్తి, రాగం, ప్రేమ వృద్ధి అవుతుంది. అయితే ఈ ప్రాపంచిక విషయాల పట్ల వైరాగ్యం వివేకం వల్లనే కలగాలి తప్ప తాత్కాలిక వైరాగ్యం వల్ల ప్రయోజనం లేదు. పురాణవైరాగ్యం, ప్రసూతివైరాగ్యం, స్మశానవైరాగ్యం మొ॥నవన్నీ తాత్కాలికంగా కలిగేవి. అవి ఎలాంటి వారికైనా కలుగుతాయి, త్వరలోనే సమసిపోతాయి.

**(3) శమాది షట్క సంపత్తి** :-

**(i). శమము :** మనో నిగ్రహం. ఎదురుగా వస్తువులున్నా వాటిపై వ్యామోహం కలగకుండా మనస్సు వాటిని పొందాలి అనే కోరిక లేకుండా మనస్సు స్వాధీనంలో ఉండాలి. ఎలా ఉంటుంది మనస్సు ? ఇవన్నీ నాకు నిజమైన, నిత్యమైన ఆనందాన్నివ్వలేవు గనుక, వీటి వ్యామోహంలో పడిపోతే నిజమైన ఆత్మానందాన్ని పొందలేను గనుక ఇవి నాకు అవసరం లేదు అనే నిశ్చయ జ్ఞానం బుద్ధిలో ఉంటే మనస్సు వాటిపై వ్యామోహం లేకుండా ఉంటుంది.

**(ii). దమము :** బాహ్యేంద్రియ నిగ్రహం. 5 కర్మేంద్రియాలు, 5 జ్ఞానేంద్రియాలు మొత్తం 10 ఇంద్రియాలు. వీటిలో 5 జ్ఞానేంద్రియాలు స్వాధీనంలో ఉంటే దమాన్ని సాధించినట్లే. కన్ను చూచినవాటి వెంటపడకుండా, చెవి విన్నవాటి వెంటపడకుండా, ముక్కు వాసనచూచినవాటి వెంటపడకుండా, చర్మం స్పర్శ ద్వారా సుఖాన్ని అందించేవాటి వెంటపడకుండా, నాలుక రుచికరమైన పదార్థాల వెంటపడకుండా ఉంటే చాలు 'దమం' అనే సాధన సాధించినట్లే.

లేడి శబ్దానికి లొంగి , ఏనుగు స్పర్శసుఖానికి లొంగి, దీపంపురుగు రూపానికి లొంగి, చేప రసానికి లొంగి, తుమ్మెద పుష్పాలలోని మకరంధం యొక్క రుచికి లొంగి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నాయి. ఒక్కొక్క ఇంద్రియానికి లొంగి అవి ప్రాణం మీదకు తెచ్చుకుంటుంటే 5 ఇంద్రియాలకు లొంగే మానవుడి గతి

ఏమిటని శంకరాచార్యులవారు వివేకచూడామణిలో ప్రశ్నించి హెచ్చరించారు. ఇంద్రియద్వారాల వద్దనే విషయాలను అడ్డుకోగలికితే ఇక మానవుడికి అధోగతి అనేది ఎన్నడు కలగదు.

**(iii). ఉపరమము :** చిత్తచాంచల్యం లేకుండా ఉండటం. ఒక స్థిర నిశ్చయంలేనివాని చిత్తం అటుఇటు పరుగెడుతూ ఉంటుంది దాని వల్ల మనస్సు అల్లకల్లోలం అవుతుంది.

**(iv). తితిక్ష :** శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు, మానావమానాలు ఎదురైనప్పుడు ఓర్పుతో ఉండటం నేర్చుకోవాలి. జీవితంలో ఎదురైన విషయాలపట్ల ఈ ఓర్పు ఉండాలేగాని, కావాలని అటువంటి స్థితులను కలిగించుకోరాదు. వేసవిలో పంచాగ్నిమధ్యంలో ఉండటం, శీతాకాలంలో మంచుగడ్డపై కూర్చోవటం... ఇలా పరీక్షలు పెట్టుకొని ఉండేది ఓర్పు కాదు. ఎవరినైనా బాగా తిట్టమనిచెప్పి ఒర్చుకోవటం ఓర్పు కాదు . ఎవరైనా తిట్టినప్పుడు ఓర్చుకోవాలి. అదే తితిక్ష. ఇది ఎలా సాధ్యం ? జీవితంలో కష్టాలు - సుఖాలు ఒక దాని తర్వాత ఒకటి వస్తాయని, వచ్చిన కష్టం అలాగే ఉండదని గ్రహించి ఓర్చుకోవాలి. (ధర్మరాజుకు శ్రీకృష్ణుడు 'ఇది ఇలాగే ఉండదు' అని చీటీ వ్రాసి కష్టాల్లోఉన్నప్పుడు ఈ చీటీ తెరిచి చూచుకోమన్నాడు.)

**(v) శ్రద్ధ :** గురువేదాంత వాక్యాదిషు శ్రద్ధా - అన్నారు. గురువు పట్ల, వేదాంత వాక్యాల పట్ల విశ్వాసాన్ని కలిగి ఉండాలి. అప్పుడే జ్ఞానం బుద్ధిలో ప్రవిశించేది. అంతే కాదు భగవంతునిపై విశ్వాసం కూడా ఉండాలి. ఆస్తిక్య బుద్ధి ఉండాలి. గురువుయందు విశ్వాసం లేకపోతే గురుబోధను స్వీకరించలేడు. గురుబోధను స్వీకరించ లేకపోతే భగవంతుని యదార్ధ తత్త్వం తెలిసే అవకాశం ఉండదు. కనుక ఈ శ్రద్ధ అనేది ఏంతో ముఖ్యం.

**(vi) సమాధానం :** తెలుసుకోవలసిన విషయమునందు బుద్ధిని చక్కగా నిలిపి ఉంచటమే సమాధానం. సమాధి అంటే బుద్ధిని సమస్థితిలో ఉంచటం. అలా ఉంచగలిగితేనే విషయం చక్కగా గ్రాహ్యం అవుతుంది.

ఈ ఆరింటిని శమాదిషట్కసంపత్తి అంటారు.

**(4) ముముక్షుత్వం :-** మోక్షాన్ని పొందాలి అనే కోరిక. నిజానికి దీనిని 4వ సాధనగా చెప్పినా ఇదే మొదటిది. మానవులంతా ఈ జీవితం బాగుండాలని, బాగా ధనం సంపాదించాలని, వస్తువులు కొనుక్కోవాలని, భోగం అనుభవించాలని - ఈ లోకంలో పరుగులు తీస్తూ ఉంటారు. వారికి శాస్త్రాలను బోధిస్తామన్నా, సాధనలు చేయమన్న, సత్సంగాలు జరుపుకోమన్నా వారికి వినిపించదు. "ఉండవయ్యా బాబు! వీటితో కూర్చుంటే

నాకేం వస్తుంది ? అంటాడు. ధనం సంపాదించే మార్గాలను చెబితే చెవులురిక్కించుకొని ఎంతసేపైనా వింటాడు కాని, మోక్షాన్ని సంపాదించే మార్గాలను చెబుతానంటే ఒక్క నిముషం కూడా వినడు. అలాంటి వానికి ఉద్ధారకం లేదు. జన్మను సార్ధకం చేసుకోవటం కుదరదు. ఎవరైతే మోక్షాన్ని అందుకోవటమే శాశ్వత ఆనందాన్ని పొందటానికి మార్గం అని తెలుసుకొని, మోక్షం కొరకు తీవ్రంగా తపన చెందుతాడో అతడికే మోక్ష మార్గం తెలుస్తుంది. కనుక తీవ్ర ముముక్షుత్వం ఉండాలి. ఇది అత్యంత ప్రధానమైనది.

ఈ సాధన చతుష్టయ సంపద కలిగినవారే ఉపనిషత్తులలో చెప్పబడిన పరమాత్మ యదార్ధ తత్త్వాన్ని అవగాహన చేసుకోగలరు, ఆచరణలో పెట్టుకోగలరు.

పూర్వకాలంలో శిష్యులు ఈ వేదాంతవిద్యను తెలుసుకొనుటకు సద్గురువులను వెతుక్కుంటూవెళ్లి, ఒక మహాత్ముని సమీపించి తమకు జన్మసార్ధక్యహేతువైన మోక్షాన్ని పొందటానికి తగిన జ్ఞానాన్ని ప్రసాదించి, మార్గాన్ని చూపమని ఆ గురువును ప్రార్ధిస్తారు. ఆయనకు కొంతకాలం సేవచేస్తారు . ఆయన వారిని కొంత కాలం వేచి ఉండమని చెబుతాడు. ఎందుకంటే వారియొక్క బౌద్ధికస్థితి ఏమిటో తెలుసుకోనుటకే. వారికి అనేక రకాల శిక్షణనిచ్చి, కొన్ని పరీక్షలుపెట్టి, వారిలో తీవ్ర ముముక్షుత్వం ఉన్నదో లేదో పరీక్షించి, వారు అన్ని అర్హతలు సమీపించారనే విశ్వాసం కలిగిన తర్వాత వేదాంత విద్యను బోధించటం ప్రారంభిస్తాడు. ఇదే 'అధ' శబ్దార్ధం.

ప్రపంచ విషయాలు అనిత్యమని తెలుసుకొని, వాటిపై వైరాగ్యం కలిగి, మనోబుద్ధులను, ఇంద్రియాలను స్వాధీనంలో ఉంచుకొని, మోక్షం కావాలనే తీవ్ర తపనతో , గురువుపై విశ్వాసంతో ఉన్నప్పుడు వారు అర్హత పొందినట్లు . అలా అర్హత పొందిన తరువాతనే విద్యాబోధన ప్రారంభం

ఇదీ 'అధః' పదం యొక్క వివరణ. ఇక అతః

**II. అతః :-** అతః అంటే అందువల్ల - కాబట్టి ఆ కారణంగా - అని. ఏ కారణంగా ? ఎందువల్ల ? అని ప్రశ్న.

"తద్యధ ఇహ కర్మజితోలోకః క్షీయత ఏవమేవ అముత్ర పుణ్యజితో లోకః క్షీయతే "- (ఛాందోగ్య)

కర్మల ద్వారా మనం సంపాదించే ధనధాన్యాలు, వస్తుసంపదలు అన్నీ క్షీణించిపోయేవే. అలాగే పుణ్య కర్మల వల్ల సంపాదించే స్వర్గ భోగాలు కూడా క్షయమైపోయేవే కాబట్టి -

అంటే ఎన్ని రకాల కర్మలు చేసినా, ఎంతటి పుణ్యకర్మలు, శాస్త్రవిహితకర్మలు, వైదికకర్మలు , ఏవి చేసినప్పటికీ ఆ కర్మల వల్ల లభించే ఇహలోక సుఖభోగాలుగాని, పరలోకంలోని స్వర్గభోగాలుగాని అన్నీ క్షయమైపోయేవే గనుక – ఏం చేయాలి ? -

"తద్ విజ్ఞానార్థం స గురుమే వాభిగాచ్ఛేత్ సమిత్ పాణిం శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం "

- సమిధలు చేతబట్టుకొని వేదాంత విజ్ఞానాన్ని గ్రహించటానికి శ్రోత్రియుడు, బ్రహ్మనిష్టుడు అయిన గురువును సమీపించాలి - అని ముండకోపనిషత్తు చెబుతున్నది.

కర్మలు చేసి చేసి, కర్మల యొక్క ఫలితం అశాశ్వతమైనదని గ్రహించిన సాధకుడు - శాశ్వతమైన మోక్ష ఫలాన్ని అందుకొనుటకు ప్రయత్నించాలి.

ఇలా అధ, అతః అనే రెండు పదాల భావం ఏమిటంటే సాధనచతుష్టయసంపద సిద్ధించిన తరువాత - కర్మల ద్వారా వచ్చే ఫలం అనిత్యము - అశాశ్వతము అనీ, మోక్షం వల్ల వచ్చేఫలం శాశ్వత ఆనందమని గ్రహించినందువల్ల - అని. ఇప్పుడు బ్రహ్మజిజ్ఞాస -

**III. బ్రహ్మజిజ్ఞాస :-** బ్రహ్మప్రాప్తి కొరకు బ్రహ్మజిజ్ఞాస చేయాలి. బ్రహ్మన్ని తెలుసుకోవాలనే ఇచ్ఛ - కోరికయే బ్రహ్మజిజ్ఞాస.

ఈ బ్రహ్మజిజ్ఞాస (తెలుసుకోవాలనే కోరిక ) ఎందుకు ?

(i) తాపత్రయనివృత్తి కోసం బ్రహ్మజిజ్ఞాస చేయాలి.

(ii) దుఃఖనివృత్తి కోసం బ్రహ్మజిజ్ఞాస చేయాలి.

(iii) మోక్షసాధన కోసం బ్రహ్మజిజ్ఞాస చేయాలి.

తాపత్రయాలంటే ? - ఆదిభౌతిక, ఆదిదైవిక, ఆధ్యాత్మిక తాపాలు. ఈ 3 తాపాలు దుఃఖాన్ని కలిగిస్తాయి. ఆనందాన్ని దూరం చేస్తాయి.

దుఃఖనివృత్తి కోసం లౌకికమైన ఉపాయాలున్నాయి గదా ! బ్రహ్మజిజ్ఞాస ఎందుకు ?

రోగమొస్తే వైద్యులు, పేదరికమైతే ధనసంపాదన, ఇల్లు లేకపోతే ఇల్లు కట్టుకోవటం, ముసలితనమొస్తే బలానికి ఔషధాలు, ఆనందానికి అనేక వస్తువులు ఉన్నాయి గదా ! ఉన్నాయి - కాని అవి దుఃఖాన్ని శాశ్వతంగా తొలగించలేవు. దుఃఖాలు పూర్తిగా, శాశ్వతంగా తొలగిపోవాలంటే జన్మరాహిత్యం - మోక్షం ఒక్కటే

మార్గం. మరొక గత్యంతరం లేదు. అట్టి జన్మరాహిత్యాన్ని - మోక్షాన్ని పొందాలంటే బ్రహ్మాత్మైక్యజ్ఞానం కావాలి. బ్రహ్మమూ - నేను ఒక్కటే అనే జ్ఞానం కావాలి. అట్టి జ్ఞానం బ్రహ్మజిజ్ఞాస వల్లనే కలుగుతుంది. అందుకే బ్రహ్మజిజ్ఞాస అవసరం. జీవబ్రహ్మైక్యత అనేది ఉపనిషత్తులలో మాత్రమే చెప్పబడింది గనుక ఉపనిషత్తుల జ్ఞానం అవసరం. కనుక ఉపనిషత్తుల విచారణ తప్పకచేయవలసి ఉంది. ఇదే మానవుని విధి - పవిత్ర కర్తవ్యం.

బ్రహ్మజిజ్ఞాస వల్లనే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. బ్రహ్మజ్ఞానం వల్లనే బ్రహ్మప్రాప్తి. బ్రహ్మప్రాప్తియే మోక్షం. అందుకే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి' అని వేదం చెబుతున్నది. బ్రహ్మమునెరిగినవాడు బ్రహ్మమే అవుతాడు అని. తెలియదగిన బ్రహ్మము, తెలిసినవాడు రెండు ఒక్కటే అదే తత్త్వమసి, అయమాత్మా బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి అనే శృతి మహావాక్యాల యొక్క భావం. కనుక జీవుని కంటే వేరుకాని బ్రహ్మమును తెలుసుకోవాలి. అందుకు బ్రహ్మజిజ్ఞాస చేయాలి. దానితో బ్రహ్మసాక్షాత్కారం.

బ్రహ్మసాక్షాత్కారం వల్ల ఈ జననమరణసంసారానికి బీజంగా - కారణంగా ఉన్న అవిద్య - అజ్ఞానం పూర్తిగా తొలగిపోతుంది.

## పూర్వ పక్షం

బ్రహ్మజిజ్ఞాస తప్పక చేయవలసినదే అని చెబుతున్నారు సరే. అసలు బ్రహ్మము ప్రసిద్ధమా ? (తెలిసినదా ?) అప్రసిద్ధమా (తెలియనిదా ?)

(i) బ్రహ్మము ప్రసిద్ధమే అయితే ఇక దానిని గూర్చి విచారణ చేయవలసిన అవసరమేముంది ? ఎందుకంటే అది తెలిసినదే అయితే శాస్త్రం ద్వారా నిరూపించదగింది కాదు. కనుక విచారణ అనవసరం.

(ii) బ్రహ్మము అప్రసిద్ధమే అయితే ఇక దానిని గూర్చి విచారణ చేసినందు వల్ల ప్రయోజనమేముంది ? అసలు తెలియనిదాని గురించి విచారణ చేయటం ఎలా కుదురుతుంది ? విచారణ అనేది బుద్ధితో చేయాలి. కాని బ్రహ్మము బుద్ధి క్షేత్రంలోనికి రాదు. అంటే బుద్ధికి అందదు. కనుక విచారణ అనవసరం.

## సమాధానం

బ్రహ్మము ప్రసిద్ధమే . అయితే ఇక్కడొక కిటుకు ఉంది. బ్రహ్మానికి సంబంధించిన సామాన్య జ్ఞానం ప్రసిద్ధం. బ్రహ్మానికి సంబంధించిన విశేషజ్ఞానం విషయంలో అనేక వివాదాలు, అభిప్రాయ భేదాలు ఉన్నాయి. అందుకోసం బ్రహ్మజిజ్ఞాస - బ్రహ్మాన్ని తెలుసుకోవాలనే కోరిక సమంజసమే.

బ్రహ్మానికి సంబంధించిన విశేషజ్ఞానం విషయంలో వివాదాలు ఏమిటి ?

1. చైతన్యంగల దేహమే ఆత్మ అని పామరులు, నాస్తికులు, చార్వాకులు అంటున్నారు.
2. మరికొందరు చేతనాలుగా కనిపించే ఇంద్రియాలే ఆత్మ అంటున్నారు.
3. కొందరు ఇంద్రియాలను ప్రేరేపించి, వాటిచేత పనులు చేయించే మనస్సే ఆత్మ అంటారు.
4. ఇంకా కొందరు బుద్ధే ఆత్మ అంటారు. వీరు బౌద్ధంలోని ఒక శాఖవారు (యోగాచారులు).
5. బౌద్ధంలోని శూన్యవాదులు (మాధ్యమిక శాఖవారు) శూన్యం తప్ప ఏమీలేదు - అదే బ్రహ్మం అంటారు.
6. దేహేంద్రియాలకు భిన్నమైన కర్త, భోక్త అయిన వాడొకడున్నాడని, అతడే ఆత్మ అని వైశేషికులు అంటారు.
7. దేహాదులకన్నా వేరైన ఆత్మ కేవలం భోక్తయే తప్ప కర్త కాదు అని సంఖ్యులు అంటారు.
8 . భోక్త కన్నా వేరుగా ఉన్న సర్వజ్ఞుడు, సర్వ శక్తిమంతుడు అయిన ఈశ్వరుడున్నాడని యోగులు అంటూ ఉంటారు.
9. ఇక వేదాంతమతాన్ని అనుసరించేవారు అవిద్యతో, ఉపాధికూడిన కర్త, భోక్త అయిన జీవాత్మను (జీవున్ని ) తత్ పదంతో చెప్పబడే ఈశ్వరునిగా నిర్ణయిస్తున్నారు, నిరూపిస్తున్నారు. జీవుడు ఈశ్వరుని కన్నా వేరు కాదని శృతి వాక్యాలు చెబుతున్నాయి గనుక జీవుడు - ఈశ్వరుడు ఒక్కరే అని చెబుతున్నారు.

ఇవి కాకుండా ఇంకా అనేక మంది, అనేక రకాలుగా ఏవేవో చెబుతున్నారు.

ఇలాంటి స్థితిలో ఏమి చేయాలో, దేనిని నమ్మాలో తెలియక తికమక పడుతుంటారు. చివరకు విసుగుతో ఆ( ఎవరికి నచ్చిన సిద్ధాంతాన్ని వారు నమ్ముకుంటారు, దాన్నే అనుసరిస్తారు. ఇంకా ఈ బ్రహ్మవిచారణ - బ్రహ్మజిజ్ఞాస ఎందుకు ? అనవసరంగా బుర్రబద్దలు చేసుకోవటం ఎందుకు ? అనుకుంటారు.

అలా వదిలేస్తే సరిపోతుందా ? లేదు. ఎందుకు ? మనకు వేదశాస్త్రాలు (ఉపనిషత్తులు) ప్రమాణాలు. ఇక ఈ ప్రపంచం - ఈ జన్మ - ఇవన్నీ దుఃఖంతో కూడుకున్నవి. మళ్ళీ మళ్ళీ జన్మల వల్ల అనంతమైన దుఃఖాలు. జన్మ - జరా - వ్యాధి - మరణ దుఃఖాలు తప్పవు. కనుక జననమరణ రహితమైన మోక్షం ఒక్కటే ఈ దుఃఖాలను తరించటానికి ఉపాయం. అట్టి మోక్షం ఎలా లభిస్తుంది ? అనే విషయంలో పైన చెప్పబడ్డ మతాలూ చాలా వరకు మౌనం వహిస్తున్నాయి. లేదా అతకని మాటలు - 'ఆకుకు అందక - పోకకు పొందక' అన్నట్లు చెబుతున్నాయి.

ఈ కారణం వల్ల మోక్షం పొందాలి అంటే బ్రహ్మజిజ్ఞాస తప్పనిసరి.

'జ్ఞానా దేవతు కైవల్యం' - జ్ఞానం వల్లనే కైవల్యం (మోక్షం) "తత్త్వ జ్ఞానా దేవానిః శ్రేయ సాధిగమః" - జీవబ్రహ్మైక్యం వల్లనే మోక్షం లభిస్తుంది - అనేది వేదాలలోని - ఉపనిషత్తులలోని సారభూతమైన సిద్ధాంతం.

'జీవో బ్రహ్మైవ నా పరః' - జీవుడు బ్రహ్మముదప్ప మరేమీ కాదు - అనే వేదాంత సిద్ధాంతాన్ని వదిలి ముముక్షువులైనవారు ఇతర మతాలను (అభిప్రాయాలను) అనుసరించినట్లయితే మోక్షాన్ని ఎప్పటికీ పొందలేరు గాక పొందలేరు. కనుకనే బ్రహ్మ విషయక విచారణ - బ్రహ్మజిజ్ఞాస తప్పక చేయవలసిందే.

ఇదీ 'అధా2తో బ్రహ్మ జిజ్ఞాస' అనే సుత్రార్ధం. సాధన చతుష్టయమనే అర్హతను సంపాదించిన తరువాత; కర్మల ద్వారా వచ్చే ఫలితం అనిత్యమైనది గనుక. (ఈ లోకంలోగాని, పై లోకాల్లో గాని కలిగేభోగాలు) అందువల్ల జ్ఞాన ఫలమైన మోక్షం మాత్రమే నిత్యమైన ఆనందాన్ని - బ్రహ్మానందాన్ని ఇస్తుందని తెలిసిన ముముక్షువు తప్పక బ్రహ్మజిజ్ఞాస చేయాలి. వేదాంత వాక్యార్ధ విచారణ చేయాలి.

అందుకే ఈ బ్రహ్మ సూత్ర రచన.